శ్రీ హరి

వసుదేవసుతం(న్) దేవం(జ్), కంసచాణూరమర్దనం
దేవకీ పరమానందం(జ్), కృష్ణం(మ్) వందే జగద్గురుం

# శ్రీమద్భగవద్గీత వివేచన సారాంశము

**అధ్యాయము 16: దైవాసుర సంపద్విభాగ యోగము**

1/2 (శ్లోకము 1-7), శనివారం, 06 జనవరి 2024

**వివేచకులు: గీత విశారద శ్రీ శ్రీనివాస వర్ణేకర్ గారు/**

YouTube లింక్: https://youtu.be/3werzA5AnHE

## దైవ, అసుర గుణములు

దీప ప్రజ్వలనము, శ్రీకృష్ణ ప్రార్థన, సరస్వతీ ప్రార్థన మరియు హరినామ సంకీర్తనముతో వివేచన కార్యక్రమము ప్రారంభమైనది. శ్రీ శ్రీనివాస్ జీ వర్ణేకర్ గారు గురువందన, వ్యాసవందన మరియు భగవద్గీతా ప్రార్థనా శ్లోకములతో తమ వివేచనని మొదలుపెట్టారు. ముందుగా మొదటి స్థాయి నుంచి రెండవ స్థాయికి చేరుకుని 16వ అధ్యాయాన్ని నేర్చుకుంటున్న సాధకులకు తమ అభినందనలు తెలిపారు. భగవద్గీతా ఒక విశిష్టమైన గ్రంథం. ఇందులో మొదటి అధ్యాయం యుద్ధం ప్రారంభించే సమయంలో, అర్జునుని విషణ్ణ మనఃస్థితి నుండి ప్రారంభమవుతుంది. రెండవ అధ్యాయంలో పరమాత్ముడు (సాంఖ్యయోగంలో) ఆత్మ తత్వాన్ని బోధిస్తాడు. మూడవ అధ్యాయం కర్మయోగం. ఈ విధంగా ముందుకు సాగుతూ 15వ అధ్యాయం ముగిసాక పరమాత్ముడు

**ఇతిగుహ్యతమం(మ్) శాస్త్రమ్, ఇదముక్తం(మ్)**
**మయానఘ।**
**ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్స్యాత్, కృతకృత్యశ్చ భారత॥**

అన్నారు. ఈ అధ్యాయంతో పరమ గుహ్యమైన జ్ఞానాన్ని బోధించడం పూర్తయింది. కాని, దీనికి అనుబంధంగా 16, 17 వ అధ్యాయాలని పరమాత్ముడు బోధించారు. తొమ్మిదవ అధ్యాయమైన రాజవిద్యా రాజగుహ్య యోగంలో పరమాత్ముడు కొన్ని పదాలను వాడారు.
**"రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః"...మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతి మాశ్రితాః"**... ఈ 16వ అధ్యాయంలో ఈ అసురీ, దైవీ గుణాలను గురించి విశదంగా పరమాత్ముడు వివరిస్తున్నారు. పూజ్య స్వామీజీ ఈ భగవద్గీతాలో అధ్యాయాలను నేర్చుకోవడానికి ఒక సులభ పద్ధతిని ప్రవేశపెట్టారు. సాధకులు అభ్యసించే క్రమంలో 12, 15 అధ్యాయాలు సరళంగా ఉంటాయి. తరువాత 16, 9,14,17 ఈ విధంగా వారు ఏర్పరచారు. ఈ అధ్యాయంలో గుణ సంపత్తిని గురించి వివరించారు. సంపత్తి అంటే మనకు ధనము, గృహాలు మొదలైనవి అన్న ఊహ కలుగుతుంది. మన గుణములే మన సంపత్తి. భగవద్గీతా కార్యక్రమాల ముందు మనం పాడుకునే ప్రబోధ గీతంలో కింది చరణాలని గుర్తు చేసుకోండి.

**సద్గుణోం కీ సాధనమే ధ్యేయజ్యోతీ నిత్ జలే**
**సంగ్రామ మయ్ ధరా పర్ విజయ రథ్ హమ్ లే చలే**

మానవుడు ఎప్పుడూ తనలోని సద్గుణాలను
పెంపొందించుకోవాలి. మనం మనలో పెంపొందించుకోవాల్సిన గుణాలు ఏవి, వర్జించాల్సిన గుణాలు ఏవన్నది ఈ అధ్యాయం మనకు తెలుపుతుంది.

**16.1**

**అభయం సత్త్వసంశుద్ధిః(ర్), జ్ఞానయోగవ్యవస్థితిః ।**
**దానం(న్) దమశ్చ యజ్ఞశ్చ, స్వాధ్యాయస్తప ఆర్జవమ్॥1॥**

శ్రీ భగవానుడు పలికెను - నిర్భయత్వము, అంతఃకరణశుద్ధి, తత్త్వజ్ఞానప్రాప్తికై ధ్యానయోగమునందు నిరంతర దృఢస్థితి, సాత్త్వికదానము, ఇంద్రియనిగ్రహము, భగవంతుని, దేవతలను, గురుజనులను పూజించుట, అట్లే అగ్నిహోత్రాది ఉత్తమ కర్మాచరణము, వేదశాస్త్రములపఠన, పాఠనములు మఱియు భగవంతుని నామగుణకీర్తనములు, స్వధర్మాచరణమునందలి కష్టములను ఓర్చుకొనుట, శరీరేంద్రియాంతఃకరణముల సరళత్వము (ఆర్జవము).

దైవీ గుణ సంపత్తిలో అగ్రస్థానము అభయానిది. అభయం అంటే భయం లేకపోవడం. నిర్భయానికి, అభయానికి భేదం ఉంది. నిర్భయమంటే అస్సలు భయం లేకపోవడం. వివేచనతో కూడిన భయం ఉండాలి. కరెంటు తీగను ముట్టుకుంటే షాక్ కొడుతుంది. కాబట్టి దాన్ని ముట్టుకోకూడదన్న భయం మాత్రం ఉండాలి. అదేవిధంగా, మనల్ని చూసి కూడా ఎవరు భయపడకూడదు. అది అభయం. భక్త తుకారాం గారు ఒక ఏకాంత ప్రదేశంలో కొండమీద కూర్చుని భక్తితో భజనలు చేసుకునేవారు. మొదట్లో చుట్టుపక్కల ఉన్న పక్షులు ఆ శబ్దాలకు భయపడి పారిపోయేవి. అది ఆయనకు ఎంతో బాధను కలిగించింది. 'నా హృదయం నిర్మలంగా ఉంటే ఈ పక్షులు నావల్ల ఎందుకు భయపడతాయి 'అని అనుకునేవారు. కాని నెమ్మదిగా ఆయన సాధన చేయడం వల్ల, ఆ పక్షులు భయాన్ని వదిలి ఆయన మీద వచ్చి వాలుతూ ఉండేవి. సంస్కృతంలో ఒక శ్లోకం ఉంది.

**భోగే రోగ భయం కులే చ్యుతి భయం విత్తే నృపాలాద్భయం**
**మానే దైన్య భయం బలే రిపు భయం రూపే జరాయాభయం**
**శాస్త్రే వాది భయం గుణే ఖల్భయం కాయే కృతాంతాద భయం**

**సర్వ వస్తు భయావహం భువి నృణాం విష్ణోపదం నిర్భయం**

భోగాలు అనుభవిస్తున్నప్పుడు ,రోగాలు కలుగుతాయి అన్న భయం ఉంటుంది. ఏవైనా ఇష్టంగా తింటున్నప్పుడు కడుపునొప్పి వస్తుందేమో అని భయం. మంచి కులంలో ఉన్న వాళ్ళకి పరువు ప్రతిష్ఠలు పోతాయేమోనన్న భయం. ధనం ఉన్న వాళ్ళకి పన్నులు కట్టాలన్న భయం. బలం ఉన్న వాళ్ళకి శత్రువుల భయం. అందంగా ఉన్న వాళ్ళకి ముసలితనం వస్తుందేమోనన్న భయం. గొప్ప పండితులకి ప్రతివాదులతో భయం. గుణవంతులకి చెడ్డ వాళ్లతో భయం. శరీరానికి మృతి వస్తుందన్న భయం. ఆ కళ్యాణ చక్రవర్తి పాద కమలాలను నమ్మిన వాళ్లకి ఏ భయము ఉండదు. భగవద్గీతాను అధ్యయనం చేయడం వల్ల, పరమాత్ముడు భగవద్గీతాలో మనకు ఇచ్చిన హామీ వల్ల మనకు ఈ అభయం అనే గుణం అలవడుతుంది.
సత్త్వ సంశుద్ధి: మన అంతఃకరణం పవిత్రంగా ఉండాలి. బుద్ధి నిర్మలంగా ఉండాలి. మహాత్ముల బోధనలన్నీ ముందు బుద్ధిని, మనస్సును పవిత్రంగా ఉంచుకోమని చెప్తాయి. సమర్థ రామదాసు గారు మనసుని శుద్ధిపరచుకోవడానికి "మనాచా శ్లోక్" అన్న రెండు వందల ఐదు శ్లోకాలని మనకు ఇచ్చారు. వాటిని పఠించడం వల్ల సత్త్వ సంశుద్ధి కలుగుతుంది.
జ్ఞానయోగవ్యవస్థితి: జ్ఞానం అంటే తత్త్వ జ్ఞానం. 'తత్' అంటే పరమాత్ముడు. పరమాత్ముడిని గురించి తెలుసుకోవడం ఎలా వీలవుతుంది? ఆకాశాన్ని గురించిన జ్ఞానము కలగాలంటే మనం ఆకాశం అయిపోవాలి. పరమాత్ముడిని గురించిన జ్ఞానం పొందాలంటే పరమాత్ముడిలో మనం లీనం అవ్వాలి. యోగం అంటే ఐక్యం చెందడం, కలవడం. అటువంటి జ్ఞానయోగ స్థితిలో నిలబడడం జ్ఞానయోగవ్యవస్థితి. ఇది సద్గుణములలో అన్నింటిలో శ్రేష్ఠమైనది.

దానం: దానములో మూడు రకముల దానములు చెప్పబడ్డాయి. సాత్వికము, రాజసికము, తామసికము. వీటిని గురించి మనం ముందు ముందు తెలుసుకుంటాము. దానం ఎలా ఇవ్వాలంటే, కుడి చేత్తో ఇచ్చిన దానం ఎడమ చేతికి తెలియకూడదు. పాత్రతని, దేశ కాల పరిస్థితులనూ అనుసరించి  దానం ఇవ్వాలి. నేను ఇస్తున్నానన్న అహంకారం లేకుండా దానం చేయాలి. ఒకరు, నిత్యం దానం చేసే ఒక దానశీలి అయిన మిత్రుణ్ణి ఇలా అడిగారు

**ఐ సీ దేనీ దేన్ జు కిత్ సీఖే హొ సేన్**
**జ్యోం జ్యోం కర్ ఊంచౌ కరో త్యోం త్యోం నీచే నైన్**

ఓ మిత్రుడా! నీవిలా దానం చేయడం ఎలా నేర్చుకున్నావు? ఎప్పుడెప్పుడు నీ చేతులు  దానం ఇచ్చేటప్పుడు పైన ఉంటాయో, అప్పుడు నీ కళ్ళు సిగ్గుతో కిందకు వాలుస్తావు.
దానికి జవాబుగా అతడు ఇలా అన్నాడు.

**దేన్ హార్ కోయీ ఔర్ హై భేజత్ హై దిన రైన్**
**లోగ్ భరమ్ హమ్ పర్ కరేం తాసో నీచే నైన్**

ఇచ్చేవాడు వేరొకడున్నాడు. అతడు అనంతమైన కరుణతో  రాత్రింబవళ్లు ఇస్తూనే ఉంటాడు. కానీ తీసుకునే వాళ్ళు 'నేను ఇస్తున్నాను' అని అనుకుంటారు. అందువల్ల సిగ్గుతో కళ్ళు కిందకి వాలి పోతాయి.
దమము: అంటే ఇంద్రియాలు మీద నిగ్రహము.
యజ్ఞము:  ఈ యజ్ఞము అనే మాట భగవద్గీతాలో చాలా చోట్ల వస్తుంది. మనకు యజ్ఞం అంటే అగ్నిగుండము, ఆహుతులు ఇవే గుర్తుకు వస్తాయి. కాని యజ్ఞం అంటే, విహిత కర్మలని కర్తవ్యాలుగా భావించి, ఫలాపేక్ష లేకుండా, పరమాత్ముడికి ఫలితాన్ని అర్పించి చేయడమే! జీవితంలో  ఎన్నో భూమికలలో కర్తవ్యాలని ఆచరించాల్సి వస్తుంది. వాటిని పరమాత్మ మనకు నిర్దేశించినవిగా భావించి, ఆచరించడమే యజ్ఞం.
స్వాధ్యాయము: మనం నిరంతరం చేసే అభ్యాసము స్వాధ్యాయము. ఇది రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి ఉపజీవిక కోసం చేసే సాధన. మన ఉదర నిర్వాహణ కోసం మనం ఎన్నో రకాల పనులు చేయాల్సి వస్తుంది. ఆ పనులకు కూడా నైపుణ్యము, జ్ఞానము అవసరమవుతాయి. వాటి కోసం కూడా మనం అభ్యాసం చేయాల్సి వస్తుంది. ఇది కాక ఆత్మజ్ఞానాన్ని సముపార్జించడం కోసం, ఆధ్యాత్మిక పురోగతి కోసం, భగవత్ ప్రాప్తి కోసం చేసే సాధన స్వాధ్యాయము.
తపము: ఈ రకమైన సాధనలో ఎన్నో కష్ట నష్టాలను ఓర్చుకోవాల్సి వస్తుంది. ద్వంద్వాలను విడనాడాల్సి వస్తుంది. దీనినే తపము అంటారు.**"తపో ద్వంద్వ సహనం"**.. శీతోష్ణ సుఖదుఃఖాలని సమానంగా స్వీకరించి, సహించడం తపస్సు.
ఆర్జవం: ఆర్జవం అంటే ఋజు ప్రవర్తన. అర్జునుడిలో ఇటువంటి సరళమైన ప్రవర్తన ఉండేది. అందుకే శ్రీకృష్ణుడికి అర్జునుడు  అంటే చాలా ఇష్టం. అతడికి భగవద్గీతా బోధించి విశ్వరూప దర్శనం అనుగ్రహించారు. సద్గుణాలని  మన చుట్టుపక్కల నుండి, ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. స్వామీజీ అమెరికా ప్రెసిడెంట్ రూజ్ వెల్ట్ గురించి చెప్పారు. ఆయన రోజూ తన ముందర ఒక సద్గుణాల పట్టిక పెట్టుకునే వాడు. రోజుకి ఒక సద్గుణాన్ని, అవలంబించి దానిని పాటించడం సాధన చేసేవాడు. భగవద్గీతా అధ్యయనం వలన ఇటువంటి ఎన్నో సద్గుణాలు మనకు అలవడుతాయి.
ఎంతో మంది గీతాసేవీలు  భగవద్గీతాను నేర్చుకుని,
ప్రశిక్షకులుగా ఇతరులకు నేర్పుతున్నారు. అందుకే అన్నారు Teaching is the best way of learning.

**16.2**

## అహింసా సత్యమక్రోధః(స్), త్యాగః(శ్) శాన్తిరపైశునమ్ ।
## దయా భూతేష్వలోలుప్త్వం(మ్), మార్దవం(మ్) హ్రీరచాపలమ్॥2॥

అహింస (మనోవాక్కాయముల ద్వారా ఎవ్వరికిని ఏ విధముగను కష్టమును కల్గింపకుండుట), సత్యము (యథార్థమైన, ప్రియమైన భాషణము), అక్రోధము (తనకు అపకారము చేయువారిపైనకూడ కోపము

లేకుండుట), త్యాగము (కర్మాచరణమునందు కర్తృత్వాభిమానమును త్యజించుట), శాంతి (చిత్తచాంచల్యము లేకుండుట), అపైశునము (ఎవరినీ నిందింపకుండుట), దయ (అన్ని ప్రాణులయెడ నిర్హేతుక కృప), అలోలుప్త్వము (ఇంద్రియవిషయసంయోగము ఉన్నను వాటిపై ఆసక్తి లేకుండుట), మార్దవము (కోమలత్వము), శాస్త్ర విరుద్ధ కార్యాచరణమునకు వెనుకాడుట (సిగ్గుపడుట), అచాపలము (వ్యర్థచేష్టలు చేయకుండుట)...

అహింస: '**అహింసా పరమో ధర్మః**' అన్నారు. ఇతరులను మనం మనో వాక్కాయములతో నొప్పించకుండా ఉండడం అన్నిటికన్నా గొప్ప ధర్మము. కాని దాని తరువాత '**ధర్మ హింస తథైవచ** '**అన్నారు**. మనకు జీవితంలో ఎన్నో రకాలైన కర్తవ్యాలు ఉంటాయి. వీటిని మనము పితృ ధర్మము, మాతృ ధర్మము, అతిథి ధర్మము అంటాము. వీటిని ఆచరించాల్సినప్పుడు మధ్యలో ఏదైనా అడ్డంకులు వచ్చినప్పుడు, ధర్మం కోసం ఆచరించే హింస కూడా అహింసయే అవుతుంది. ఉదాహరణకి ఒక తీవ్రవాది కొన్ని వందల మంది ప్రాణాలను బలి కొన్నాడు. న్యాయాధీశుడు అతడికి ఉరిశిక్ష విధించాడు. తలారి అతడికి ఉరిశిక్షను అమలు చేస్తే అది హింస కాదు. అది సమాజ శ్రేయస్సు కోసం అవసరం. ధర్మం కోసం చేసే హింస అహింస అని అర్థం చేసుకోవాలి. సరిహద్దుల్లో శత్రువులని సంహరించడం సైనికులు దేశ రక్షణ కోసం చేస్తున్న అహింస.
సత్యం: ఎప్పుడూ నిజమే మాట్లాడాలి. సంస్కృతంలో ఒక సుభాషితం ఉంది.

**సత్యంబ్రూయాత్ ప్రియంబ్రూయాత్ న బ్రుయాత్ సత్యమప్రియమ్**
**ప్రియంచ నానృతం బ్రూయాదేష ధర్మః సనాతనః**

నిజమే మాట్లాడాలి. అది ప్రియమైనదిగా ఉండాలి. అప్రియమైనది సత్యమైనా కూడా అవసరం లేనప్పుడు పలుకకూడదు. ఎవరికైనా ప్రీతి కలిగించడానికి అబద్ధాలు చెప్పకూడదు. ఇదే సనాతనమైన ధర్మము. జ్ఞానేశ్వర్ మహారాజు గారు అంటారు ," మనం పలికే పలుకులు మధురంగా ,ప్రియమైనవిగా, మృదువుగా, అమృతమయమైనవిగా ఉండాలి".
అక్రోధము: కోపం లేకుండా ఉండడం అక్రోధము. మామూలుగా సాధువులు, మహాత్ములు, సత్వగుణ సంపన్నులు మొదలైన వారికి ఎన్ని కష్టాలు, అడ్డంకులు ఎదురైనా కోపం రాదు. కోపం రావడానికి, కోపం తెచ్చుకోవడానికి తేడా ఉంది. కోపం రావడం అన్నది ఒక ప్రతిక్రియ. ఒక ఉపాధ్యాయుడు తన విద్యార్థులని క్రమశిక్షణతో సరైన మార్గంలో పెట్టడానికి కోపం తెచ్చుకోవాల్సి వస్తుంది. అదేవిధంగా తల్లి, బిడ్డ తప్పు చేసినప్పుడు కోపం తెచ్చుకోవాల్సి వస్తుంది. కాని అది కోపం కాదు, ప్రేమే.
త్యాగము: మనవైన విషయాలనే మనం త్యాగం చేయగలము. కాని ప్రపంచంలో ఏదీ మనది అనేది లేదన్న భావన ముఖ్యం. కర్మ ఫలాన్ని త్యాగం చేయగలగాలి. చేయించేవాడు ఆ పరమాత్ముడే అన్న స్థిరమైన విశ్వాసం మనలో ఉండాలి. ఏదైనా మంచి పని మనం చేస్తే మనం చేశామని గొప్పగా చెప్పుకుంటాం. అదే ఆ పని సరిగ్గా కాకపోతే, దేవుడు ఎందుకు ఇలా చేశాడు అని బాధ పడతాం. ఈ విధమైన పద్ధతి సరికాదు.
శాంతి: శాంతి అందరికీ అవసరమైనది. మనం మనశ్శాంతిని విషయ వస్తువులలో వెతుక్కుంటాం. కాని వాటి వల్ల అశాంతి తప్ప శాంతి దొరకదు.
అపైశునం: పశువు వంటి ప్రవర్తనని వదిలేయాలి. ఇతరుల మీద ఎప్పుడూ నిందా వాక్యాలు పలకడం అపైశునం.
భూత దయ: ప్రపంచంలోని అన్ని ప్రాణుల మీద నిర్హేతుకమైన దయ ఉండడం భూత దయ. మనం, పొరపాటున మన కాలు దేనికైనా తగిలితే, అవి జడ పదార్థాలైనా సరే, కళ్ళకద్దుకుని క్షమాపణ కోరుకుంటాం. మనం పొద్దున లేస్తూనే మన కాళ్లు భూమి తల్లికి తగులుతాయని క్షమా ప్రార్థన చేస్తాం.

**సముద్ర వసనే దేవి పర్వత స్తన మండలే**
**విష్ణుపత్నీ నమస్తుభ్యం పాద స్పర్శమ్ క్షమస్వమే**

అది మన సంస్కృతి.
అలోలుప్త్వము: అంటే విషయాసక్తి లేకుండా ఉండడము. మన జ్ఞానేంద్రియాలు ఎప్పుడూ విషయాల వల్ల

ఆకర్షింపబడుతూ ఉంటాయి. శబ్దము, దృశ్యము, రసము, గంధము, స్పర్శ. ఈ రకంగా విషయాలు మనల్ని ప్రలోభ పెడుతూ ఉంటాయి. ఒక అందమైన దృశ్యాన్ని చూసినప్పుడు, దాని వైపు ఆకర్షింప బడడం అన్నది స్వాభావికం. కాని మనం అందులోనే తగుల్కొబడరాదు. తామరాకు మీద నీటి బొట్టులా ఉండగలగాలి.
మార్దవము: కోమలత్వము, మృదుత్వము. ఇది అంతఃకరణకు సంబంధించినదై ఉండాలి. మన ప్రవర్తన అంత మెత్తగా ఉండాలి. జ్ఞానేశ్వర్ మహారాజ్ గారు అంటారు 'పచ్చిక మీద నడిచినప్పుడు దానికి నొప్పి కానంత మెల్లగా నడవాలి.'
హ్రీర చాపలము: హ్రీరము అంటే సిగ్గు. శాస్త్ర విహితము కాని పనులను ఆచరించినప్పుడు దోష భావముతో సిగ్గు కలుగుతుంది. వేదాలు మనకు సరైన శాస్త్రాలని, జీవన విధానాన్ని నిర్దేశించాయి. వాటిని తూచా తప్పకుండా అనుసరించడం మన విధి. మనం రహదారి నియమాలని పాటిస్తాం. దారికి ఎడమవైపే నడవాలి. అది ఎందుకలా అని ప్రశ్నించము. అదేవిధంగా శాస్త్రాలను కూడా అనుసరించాలి. అదేవిధంగా చాపలమంటే, విపరీతమైన విషయాసక్తి. వ్యర్థమైన విషయాలను ఆచరించకుండా ఉండడం అచాపలం ఆధ్యాత్మిక సాధనలో ఉన్న సాధకులు ఈ విధమైన సద్గుణాలను పెంపొందించుకోవాలి.

**16.3**

**తేజః క్షమా ధృతిః(శ్) శౌచమ్, అద్రోహో నాతిమానితా ।**
**భవన్తి సమ్పదం(న్) దైవీమ్, అభిజాతస్య భారత॥3॥**

ఓ అర్జునా! తేజస్సు, క్షమ, ధైర్యము, శౌచము (బాహ్యశుద్ధి), అద్రోహము (ఎవ్వరిపైనను శత్రుభావము లేకుండుట), అమానిత్వము (తాను పూజ్యుడనను అభిమానము లేకుండుట) మొదలగునవి యన్నియును దైవీసంపదగలవాని లక్షణములు.

ఈ శ్లోకంలో శ్రీకృష్ణుడు అర్జునుడిని భరత వంశీయుడైనందున 'భారత' అని సంబోధిస్తున్నాడు. మరిన్ని దైవీ గుణాలను గురించి చెప్తున్నాడు.
తేజస్సు: తేజస్సు అంటే ప్రభావం. ఒక అడవిలో మదించిన ఏనుగు సింహ గర్జన వింటే, ముందుకు వేసే అడుగుని ఆపేస్తుంది. అది ఆ గర్జన యొక్క ప్రభావం. తేజస్సుకు ఇంగ్లీషులో ఒక పదాన్ని ఉపయోగిస్తారు- 'Aura'. నిరంతరమైన ఆధ్యాత్మిక సాధన వల్ల ఒక వ్యక్తికి లభించిన ప్రభావాన్ని తేజస్సు అనవచ్చు.
క్షమ: క్షమ అన్నది మహాత్ముల యొక్క గుణం. ఎదుటి వ్యక్తి ఎంత దురాత్ముడైనా వారికి ఉన్న కరుణా హృదయం వల్ల వారు క్షమిస్తారు. కాని క్షమకు, కర్తవ్యానికి ఉన్న సూక్ష్మమైన తేడాను మనం గమనించుకోవాలి. ఒక న్యాయాధీశుడు దోషి పైన క్షమ చూపరాదు. తప్పుకు సరైన దండన ఇవ్వడం అతని కర్తవ్యం. కాని భగవద్గీతా పరమాత్ముడి కరుణని మనకు వివరిస్తుంది. తొమ్మిదవ అధ్యాయంలో పరమాత్ముడు అంటారు.

**అపి చేత్సుదురాచారో, భజతే మామనన్యభాక్ ।**
**సాధురేవ స మన్తవ్యః(స్), సమ్యగ్వ్యవసితో హి సః ॥**

ఎంతో దుర్మార్గుడైనప్పటికీ నన్ను అనన్యభావంతో సేవిస్తే, అతడు సరైన నిర్ణయం తీసుకున్న వాడే కాబట్టి సాధుసత్పురుషుడు గానే ఎంచదగినవాడు. త్వరలో ధర్మాత్ముడై శాంతిని పొందుతాడు. దీనివల్ల మనకు పరమాత్ముడి అనన్య కరుణను గురించి అర్థం అవుతుంది.
ధృతి: ధృతి అంటే ధైర్యం. కష్టాలు, ప్రతికూల పరిస్థితులు ఏర్పడినప్పుడు మనం కృంగిపోకుండా, దానికి ఎదురు నిలవడం ధృతి. శివాజీ మహారాజు అఫ్జల్ ఖాన్ ని ఎదిరించేటప్పుడు చూపినది ధృతి. హిందూ మందిరాలన్నీ పడగొట్టుకుంటూ ముందుకు వస్తున్న అతన్ని నేరుగా యుద్ధానికి పిలవడం వల్ల, తమ సైన్యానికి నష్టం తప్ప వేరే ఉపయోగం ఉండదు. అందుకని ఆయన సంధి ప్రయత్నం అన్న పేరుతో అతడిని మట్టు పెట్టారు. అది ఈ నిజమైన ధృతి.
శౌచము: శుభ్రత, స్వచ్ఛత, పవిత్రత ఇవన్నీ కలిపితే అది శౌచమనబడుతుంది. ఒక గ్లాసులో నీరు శుభ్రంగా

ఉండవచ్చు. కాని వాటిలో సూక్ష్మజీవులు ఉండవచ్చు. కేవలం గంగాజలం మాత్రమే పవిత్రమైనది. ఈ రకంగా అంతఃకరణాన్ని శుభ్రంగా, స్వచ్ఛంగా, పవిత్రంగా ఉంచుకోవడం శౌచం.
అద్రోహము: ఎవరిమీద శత్రుభావం లేకుండా ఉండడం అద్రోహము. ఒకవేళ యుద్ధంలో శత్రువుల మీద దాడి చేయాల్సి వచ్చినా, అది ఒక కర్తవ్యం గానే చేయాలి తప్ప, వారి మీద ద్వేషం ఉండకూడదు. అందుకనే 12వ అధ్యాయంలో భక్తుడి లక్షణాలని తెలుపుతూ పరమాత్ముడు "**అద్వేష్టా సర్వభూతానామ్**" అన్నారు. రావణాసురుడు యుద్ధంలో మరణించినప్పుడు, విభీషణుడు తాను అంత్యక్రియలు నిర్వర్తించనని అన్నాడు. అందుకు శ్రీరాముడు, మరణంతో వైరం కూడా సమసి పోతుందని, 'నీవు చేయకుంటే నేను అంత్యక్రియలు చేస్తాన'ని అన్నారు. ఇది ద్వేష భావం లేకపోవడానికి చక్కటి ఉదాహరణ.
నాతి మానితా: మనకు పదవి, ధనము, అన్నీ ఉన్నప్పుడు దానికి తగిన ప్రతిష్ఠ దొరకాలని ఉంటుంది. అందరూ మనల్ని గౌరవించాలని, సత్కరించాలని ఉంటుంది. ఈ రకమైన అహంకారం లేకపోవడం నాతిమానిత.
ఈ రకమైన దైవీ గుణాలు మనలో ఉన్నాయా అని చూసుకోవడం, మనల్ని మనమే అద్దంలో చూసుకున్నట్టు అవుతుంది.

**16.4**

**దమ్భో దర్పోఽభిమానశ్చ, క్రోధః(ఫ్) పారుష్యమేవ చ ।**
**అజ్ఞానం(ఞ్) చాభిజాతస్య, పార్థ సమ్పదమాసురీమ్॥4॥**

ఓ పార్థా! దంభము (కపటము), దర్పము (మొండితనము), అభిమానము, క్రోధము, పారుష్యము, (మాటల యందును, చేష్టలయందును కఠినత్వము), అజ్ఞానము మొదలగునవి అసురీ స్వభావముగలవాని లక్షణములు.

మన ఇంట్లో చెత్త బుట్ట ఉంటుంది. మనం మనకు అక్కర్లేని పదార్థాలను అందులో పడేస్తూ ఉంటాము. అందువల్ల మన ఇల్లు శుభ్రంగా ఉంటుంది. అదేవిధంగా ఎటువంటి దుర్గుణాలను మనం విసర్జించాలో పరమాత్ముడు ఈ శ్లోకంలో చెబుతున్నారు.
దంభము: మనకు లేని వాటిని కపటంగా అందరికీ ప్రదర్శించడం దంభం అనబడుతుంది. ఇది అన్నిటికన్నా పెద్ద దుర్గుణం. ఈ మధ్య ప్రపంచంలో ఇది చాలా ప్రబలి పోతూ ఉంది.
దర్పము: మనం జీవితంలో కొంత అభివృద్ధిని సాధించినా కూడా, మన ప్రవర్తనలో ఈ విధమైన మార్పులు వస్తాయి. మనమేదో ఆకాశం నుంచి కిందికి వచ్చినట్టుగా, అందరూ మనల్ని గౌరవించాలని, సత్కరించాలని ఆశిస్తాం. మనమే అందరికన్నా గొప్ప అన్న ఒక భావన వస్తుంది. ఇది మనలో వచ్చిందా అని ఎప్పటికప్పుడు మనల్ని మనం పరిశీలించుకుంటూ ఉండాలి. సాధారణంగా మనకు ఎదుటివారి చిన్న తప్పులైనా తెలుస్తూ ఉంటాయి. కాని మన తప్పులు మనకు తెలియవు. అందుకే వేమన అన్నారు- "**తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరయా**"
అభిమానము**:** అభిమానంలో స్వాభిమానము, గర్వము అని రెండు ఉన్నాయి. ఆత్మాభిమానం ఉండి తీరాలి. కాని గర్వము ఉండకూడదు. మనకు వివేకానంద స్వామి జీవితంలో దీనికి ఒక చక్కటి ఉదాహరణ దొరుకుతుంది. ఆయన ఒకసారి నౌకలో ప్రయాణం చేస్తున్నప్పుడు, డెక్ మీదకి వెళ్లారు. అక్కడ ఇద్దరు ఆంగ్లేయులు ఈయన గురించి చాలా అవహేళనగా మాట్లాడారు. ఆయన దానిని పట్టించుకోకుండా శాంతంగా ఉన్నారు. కాని వారు భారతదేశాన్ని గురించి చాలా హీనంగా మాట్లాడడం మొదలుపెట్టారు. అప్పుడు ఆయన వారి కాలర్ పట్టుకుని గుంజి, "మీరు ఇంకొక మాట మాట్లాడారంటే మిమ్మల్ని సముద్రంలోకి విసిరేయగలను "అని కోపంగా అన్నారు. ఎప్పుడు అభిమానం చూపాలి, చూపకూడదని మనకు తెలియాలి. ఆయన తనని గురించి మాట్లాడినప్పుడు ఏమీ స్పందించలేదు. కాని అన్నిటికన్నా దేశం ముఖ్యం. మన దేశాన్ని అగౌరవపరిస్తే మనం ఊరుకోకూడదు.
క్రోధము: కోపం. అనవసరంగా కోపం తెచ్చుకోవడం అసురీగుణం.
పారుష్యం: కఠోరత. మృదుత్వానికి వ్యతిరేకమైనది ఈ పదం. మనం మాట్లాడడంలో, వ్యవహారంలో చాలా

కఠినంగా, ఎదుటి వారి మనసును బాధ పెట్టేలా ప్రవర్తించడం పారుష్యం. ఇది అసురీగుణం.
అజ్ఞానం: శాస్త్రాలను గురించి, ఉపజీవికకు కావాల్సిన ఎన్నో
విషయాలను గురించి జ్ఞానం ఉన్నా కూడా, ఆత్మజ్ఞానం లేకపోవడం అజ్ఞానమే అవుతుంది.

**16.5**

## దైవీ సమ్పద్విమోక్షాయ, నిబన్ధాయాసురీ మతా ।
## మా శుచః(స్) సమ్పదం(న్) దైవీమ్, అభిజాతోఽసి పాణ్డవ॥5॥

ఓ అర్జునా! దైవీసంపద ముక్తిదాయకము. ఆసురీసంపద బంధహేతువు. నీవు దైవీసంపదతో పుట్టినవాడవు. కనుక శోకింపకుము.

దైవీ సంపద మోక్షానికి కారణం అవుతుంది. అసుర సంపద సంసారంలో బంధిస్తుంది. మనిషి జన్మ ఎత్తినాక ఉన్నతమైన ధ్యేయం ఉండాలి. భగవత్ ప్రాప్తి కన్నా ఉన్నతమైన ధ్యేయం లేదు. అర్జునుడు సత్వగుణ సంపన్నుడు. అతడిలో దైవీ సంపద మెండుగా ఉంది. అందుకే పరమాత్ముడు అతడికి భగవద్గీతాను బోధించారు. పరమాత్మ ప్రాప్తి కోసం మనం కూడా అర్జునుడు కావాలి. అందుకే పరమాత్ముడు అర్జునుడితో అంటున్నారు. "అర్జునా! నీవు విచారించకు. నీవు దైవీ సంపదతోనే పుట్టావు." మనలో కూడా ఎంతో కొంత దైవీ సంపద ఉండబట్టి, గీతా పరివార్ ద్వారా ఈ పవిత్రమైన భగవద్గీతా ని అధ్యయనం చేయగలుగుతున్నాము.

**16.6**

## ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్, దైవ ఆసుర ఏవ చ ।
## దైవో విస్తరశః(ఫ్) ప్రోక్త, ఆసురం(మ్) పార్థ మే శృణు॥6॥

ఓ అర్జునా! ఈ లోకముననున్న మానవులు రెండువిధములుగా ఉందురు. దైవలక్షణములు గలవారు కొందఱు. ఆసురలక్షణములు గలవారు మఱికొందఱు. దైవ లక్షణములు విస్తృతముగా తెల్పబడినవి. ఇప్పుడు ఆసురలక్షణములుగలవారిని గూర్చి వివరముగా తెల్పెదను వినుము.

ఈ లోకంలో దైవం, ఆసురం అని ప్రాణుల సృష్టి రెండు రకాలు. ఇంతవరకు దైవీ సృష్టిని గురించి విస్తారంగా చెప్పబడింది. ఇప్పుడు ఆసుర సృష్టి గురించి వినమని పరమాత్ముడు అంటున్నారు. పరమాత్ముడు రెండవ అధ్యాయం నుండి దైవీ గుణాలని గురించే చెబుతూ వస్తున్నారు. స్థితప్రజ్ఞుడి లక్షణాలని, భక్తుడి లక్షణాలని, జ్ఞాని యొక్క లక్షణాలని, గుణాతీతుడి యొక్క లక్షణాలని వరుసగా చెబుతూ వచ్చారు. ఇప్పుడు ఆసురీ గుణాలను గురించి కూడా తెలుసుకోమని చెప్తున్నారు.

**16.7**

## ప్రవృత్తిం(ఇఁ) చ నివృత్తిం(ఇఁ) చ, జనా న విదురాసురాః ।
## న శౌచం(న్) నాపి చాచారో, న సత్యం(న్) తేషు విద్యతే ॥7॥

ఆసురస్వభావముగలవారు ప్రవృత్తినివృత్తులను (కర్తవ్యాకర్తవ్యములను) ఎఱుగరు. కనుక వారిలో బాహ్యాభ్యంతర శుచిత్వముగాని, శ్రేష్ఠమైన ప్రవర్తనగాని, సత్యభాషణముగాని ఉండనే ఉండవు.

ఆసురిగుణము ఉన్నవాళ్లు ప్రవృత్తిని, నివృత్తిని ఎరుగరు. వారిలో శౌచము ,ఆచారము, సత్యము ఉండదు. ప్రవృత్తి అనగా బంధానికి దారి తీసేది. నివృత్తి అంటే మోక్షానికి దారి తీసేది. దుర్యోధనుడు, అర్జునుడు ఒకే గురువైన ద్రోణాచార్యుడి వద్ద చదువుకున్నారు. ఆయన వారికి ధర్మాన్ని సరిగ్గానే బోధించాడు. అర్జునుడు ధర్మాన్ని పాటించాడు. దుర్యోధనుడు పాటించలేదు. దుర్యోధనుడు అనేవాడు " నాకు ధర్మమేదో అధర్మమేదో

తెలుసు. కాని నేను ఏ పని చేసినా, అది చేయకూడనిదని తెలిసినా కూడా, నాకు అదే చేయాలని అనిపిస్తుంది. కనుకనే అధర్మమైనా నేను అదే పనిని చేస్తాను". అలా ఎందుకు అవుతుందో పరమాత్ముడు కర్మయోగంలో చెప్పారు. **"కామయేష క్రోధయేష రజోగుణ సముద్భవః ",** రజో గుణము వల్ల సంభవించిన ఈ కామ క్రోధాల వల్ల మానవులు అధర్మాన్ని ఆచరిస్తూ ఉంటారు. ధర్మాన్ని అనుసరించనప్పుడు మనిషికి పశువుకు తేడా ఉండదు.

**ఆహార నిద్రా భయమైథునంచ**
**సమాన్యమేతత్ పశుభిర్నరాణామ్**
**ధర్మోపి తేషామధికో విశేషః**
**ధర్మేణ హీనః పశుభిః సమానాః**

ఆహారం, నిద్ర, భయము, మైథునము పశువులకి, నరులకి సమానంగా ఉంటాయి. కాని మనిషిని వాటిలో ఉన్నతుడిగా నిలబెట్టేది ధర్మం ఒక్కటే. అది పాటించనప్పుడు మనిషికి పశువుకి తేడా లేదు.
మనం ఎటువంటి గుణాలను అలవరుచుకోవాలో, ఎటువంటి గుణాలను త్యజించాలో ఈ అధ్యాయంలో పరమాత్ముడు చెప్పారు. తర్వాత శ్లోకాలలో మిగిలిన గుణాలను గురించి తెలుసుకుందాం. అంతటితో వివేచన పూర్తయింది.ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలయింది.
ప్రశ్న: స్వామి వివేకానంద డెక్ మీద ఇంగ్లీషులో ఏం చెప్పారో నాకు అర్థం కాలేదు.
జవాబు: వివేకానంద గారు డెక్ మీద ఆంగ్లేయులతో మాట్లాడుతూ ఇలా అన్నారు. My country first. My mission next. Myself never.
ప్రశ్న: దుర్యోధనుడికి ధర్మమేది, అధర్మం ఏది అని తెలిసి కూడా ఎందుకు దుర్మార్గాలు చేశాడు?
జవాబు: దీనికి జవాబు మూడవ అధ్యాయంలో పరమాత్ముడే చెప్పారు. "కామ ఏష క్రోధ ఏష, రజోగుణసముద్భవః". ఉదాహరణకి రోడ్లో వెళ్తున్నప్పుడు, ఒక పెద్ద కారు కనిపించింది. ఒకతనికి దాన్ని కొనాలన్న ఆశ పుట్టింది. దానికి కావాల్సినంత ధనం లేదు. అధర్మ మార్గంలో ధనాన్ని సంపాదించి అటువంటి కారు కొన్నాడు. మిత్రులందరూ ఆ కారుని చూసి సంతోషించారు. ఒక మిత్రుడు ఆ కారుని నడిపిస్తున్నప్పుడు దానికి యాక్సిడెంట్ అయింది. అలా నష్టం జరగడంతో ఇతను ఆ మిత్రుడితో పోట్లాడాడు. ఈ విధంగా కామ క్రోధాల వల్ల నష్టాలు జరుగుతూ ఉంటాయి. అలాగని కోరికలు అస్సలు ఉండకూడదని కాదు. ఏడవ అధ్యాయంలో పరమాత్ముడు అన్నాడు."**ధర్మా విరుద్ధో భూతేషు,కామోఽస్మి భరతర్షభ** " మనకు శాస్త్రం నాలుగు పురుషార్థాలను నిర్దేశించింది. అవే ధర్మార్థ కామ మోక్షాలు. ధర్మ బద్ధంగా అర్థాన్ని సంపాదించి, కామాన్ని ( కోరికలని) తీర్చుకున్నప్పుడు, మోక్షమార్గం సుగమమవుతుంది.
ప్రశ్న: బ్రహ్మ విష్ణువు యొక్క నాభి నుంచి పుట్టారని అంటారు. మరి శివుడు ఎలా పుట్టాడు?
జవాబు: శివుడికి పుట్టుక లేదు. పరమాత్ముడు ఆదిమధ్యాంత రహితుడు. శివపార్వతుల కళ్యాణమప్పుడు, శివుడిని పురోహితులు నీ తండ్రి ఎవరు అని అడిగారు? దానికి ఆయన బ్రహ్మ అని చెప్పారు. మీ తాత ఎవరంటే విష్ణువు అని చెప్పారు. ముత్తాత ఎవరంటే నేనే అన్నాడు. అంతటా వ్యాపించిన పరమాత్మ ఒక్కరే అని అర్థం చేసుకోవాలి. ఇవన్నీ వివిధ రూపాలు.
ప్రశ్న: సంసారంలో ఉంటూనే పరమాత్మ ప్రాప్తి ఏ విధంగా లభిస్తుంది? ఈ బంధనాల మధ్య భగవంతుడిని ఏవిధంగా చేరుకోగలం?
జవాబు: పరమాత్ముడు భగవద్గీతాలో ఈ విషయం గురించి విస్తృతంగా వివరించాడు. "**సర్వభూత హితే రతాః** ". విశ్వంలోని అన్ని ప్రాణుల మీద కరుణ కలిగి ఉండడం. విశ్వవ్యాపి అయిన పరమాత్ముడు, అన్ని ప్రాణులలోను స్థితుడై ఉన్నాడు. అన్నింటిలోనూ, అంతటనూ పరమాత్ముడిని చూడగలగడం అభ్యసించాలి. అందుకే అన్నారు. " **ఉదార చరితానామ్ వసుధైవ కుటుంబకం**". నా ఇల్లు, నా ఊరు ,నా దేశం అన్న సంకుచితత్వం నుండి, ఈ విశాల విశ్వమంతా నాదే అన్న విశాల భావన లోనికి ప్రయాణిస్తే, భగవత్ ప్రాప్తి కలుగుతుంది. సాణే గురూజీ యొక్క కవితని ఉదాహరించారు. దాని భావం ఏమిటంటే " ప్రపంచంలో ఉన్నది ఒకటే ధర్మం. అది అందరినీ ప్రేమించడం. దీనులని, దళితులని, అభాగ్యులని ఆదరించడం". సంసారమే పరమాత్ముడని నమ్మినప్పుడు, దానిని సరిగ్గా ఆచరిస్తే భగవంతుడిని పొందుతాము.
ప్రశ్న: సంసారంలో ఉన్నప్పుడు, ఎప్పుడూ సత్యాన్ని పలకడం, అనుసరించడం ఎలా వీలవుతుంది?
జవాబు: మహాత్ములు ,ఋషులు ఏ విధమైన సత్యాన్ని నిర్దేశించారో దానిని అనుసరించాలి. పరమాత్ముడు

17వ అధ్యాయంలో అన్నారు.

**సద్భావే సాధుభావే చ, సదిత్యేతత్ప్రయుజ్యతే ।**
**ప్రశస్తే కర్మణి తథా, సచ్ఛబ్దః(ఫ్) పార్థ యుజ్యతే ॥**

మంచి కర్మలకు కూడా సత్ అనే పదం ఉపయోగించబడుతుంది.
ప్రశ్నోత్తరాల కార్యక్రమం తర్వాత ప్రార్థన మరియు హనుమాన్
చాలీసా పారాయణంతో కార్యక్రమం ముగిసింది.

---



మీకు ఈ అర్థ వివరణ చదివి ఆనందం కలిగింది అని విశ్వసిస్తున్నాము. దిగువ ఇవ్వబడిన లింక్ ద్వారా దయచేసి మీ అమూల్యమైన మూడు నిమిషముల సమయమును వెచ్చించి మీ అభిప్రాయాలను తెలుపగలరు

https://vivechan.learngeeta.com/feedback/

**మీరు వివేచన సారాంశము చదివినందుకు ధన్యవాదములు!**
మీరు వివేచన సారాంశము చదివినందుకు ధన్యవాదములు! గీతా సేవకులు అయిన మేము అందరమూ ఎంతో శ్రద్ధా భావముతో ఈ వివేచన ద్వారా సరియైన భావాన్ని అర్థవంతంగా మీకు అందించాలని ప్రయత్నం చేస్తున్నాము. అయినప్పటికీ భావము, భాషా సంబంధిత తప్పులు ఏమైనా ఉంటే క్షమించమని కోరుతున్నాము.

---

**జై శ్రీకృష్ణ**
సంగ్రాహకులు: గీతా పరివార్ సృజనాత్మక రచనా విభాగం

---

**ప్రతి గృహములో గీత, ప్రతి చేతిలో గీత!!**
రండి, మనమందరం కలిసి ఈ గీతా పరివార్ లక్ష్యం సాదిద్దాము. మనప్రియమైన మిత్రులు, సన్నిహితులు మరియు కుటుంబ సభ్యులందరికి గీతా పరివార్ ఆన్లైన్ తరగతులు అనే బహుమతి ఇద్దాము.

https://gift.learngeeta.com/

---

గీతాపరివార్ ఒక నూతన కార్యక్రమమునకు శ్రీకారముచుట్టినది. ఇప్పుడు మనమందరము ఇంతకుపూర్వము జరిగిన సమస్త వివేచన కార్యక్రమముల యూట్యూబ్ వీడియోలను , పీ.డీ.యఫ్. లను క్రింద సూచించిన లింకు ద్వారా చూడవచ్చును.

https://vivechan.learngeeta.com/

---

**గీత నేర్చుకోండి గీతా ప్రసారము చేయండి గీతలో నిమగ్నులు కండి**
**।। ఓం శ్రీ కృష్ణార్పణమస్తు ।।**